

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

# సక్సెస్ చేయాలి

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల

సూర్యాపేట టౌన్, మే 30 : జూన్ 2న తెలంగాణరాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా జాతీయ పతాకాన్ని, బీఆర్ఎస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తామన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం నడిపి కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని కేసీఆర్ చావు అంచులకు వెళితే 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి పథంలో పయనించాలని పదేళ్ల పాటు శ్రమించిన కేసీఆర్ తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపాడన్నారు. నాటి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ పరిస్థితులు, బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ చేసిన అభివృద్ధి మరోసారి ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి దేశానికి ఆదర్శంగా నిలిపిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



బాబు వ్యాఖ్యలు

# హాస్యాస్పదం

- అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మే 30 (నమస్తే తెలంగాణ) : చంద్రబాబు అంటేనే అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అనే విషయం మరోసారి రుజువు అయిందని.. మహానాడులో హైదరాబాద్ అభివృద్ధి తనతోనే జరిగిందని బాబు చెప్పడం హాస్యాస్పదమని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనేందుకు అమెరికాకు వెళ్లిన జగదీశ్ రెడ్డి వీడియో విడుదల చేశారు. 2004లోనే తెలంగాణలో చంద్రబాబు చరిత్ర ముగిసిందని అలాంటిది మహానాడులో తెలంగాణ ముచ్చటెందుకన్నారు. 2014 నుంచి ఆంధ్రాలో మీ ఐదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధి ఒక్కసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. 2004లో సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తలసరి ఆదాయం 26వేల లోపే ఉన్నదని అలాంటిది కేసీఆర్ పాలనలో అన్నిరంగాలు అభివృద్ధిలో దూసుకుపోయి తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ నాడు తెలంగాణలో 1.12 లక్షల తలసరి ఆదాయముంటే కేసీఆర్ పాలనలో 3.70 లక్షలకు చేరిందన్నారు. నిజంగా మీ పరిపాలన గొప్పదే అయితే ఏపీ ఆదాయం ఎందుకు పెరుగుతలేదో చెప్పాలన్నారు.







# రేషన్.. పరేషాన్!

## మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తామని ప్రకటించిన కేంద్రం

### సరిపడాలేని సన్నాలు.. గోదాంల కొరత

- రేషన్ షాపులకు చేరని సన్నాలు
- మల్లగుల్లాలు పడుతున్న అధికారులు
- తరుగు తీస్తున్నారని డీలర్ల ఆవేదన

*రేషన్‌కార్డు లబ్ధిదారులకు మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రతినెలా 20వ తేదీ నుంచి పది రోజుల పాటు స్టేజ్-1 నుంచి స్టేజ్-2 ద్వారా డీలర్లకు బియ్యం అందుతుండగా ఈసారి 30 తేదీ వచ్చినప్పటికీ బియ్యం సరఫరా కాలేదు. దీనికి కారణం స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్ హమాలీల సమ్మె అని తెలుస్తున్నది. ఇదిలా ఉండగా జిల్లా గోదాంలల్లో మూడు నెలలకు సరిపడా సన్న బియ్యం లేవు. ఇస్తున్న బియ్యంలో ప్రతి 50కిలోల బస్తాకూ రెండు నుంచి మూడు కిలోలు తక్కువ వస్తున్నాయని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.*

*సూర్యాపేట, మే 30 (నమస్తే తెలంగాణ) : తెల్ల రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం రెండు నెలలుగా బియ్యం పంపిణీకి అపసోపాలు పడుతున్నది. నెలాఖరు వరకు బియ్యం ఇవ్వడం... చాలా చోట్ల నోస్టాక్ బోర్డులు తగిలించిన ఉదంతాలు కోకొల్లలు. సన్నబియ్యం ఇస్తున్నప్పుడు ప్రతి ఒక్కరూ తీసుకుంటారనే ఆలోచనతో ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడం వల్లనే అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ఈ నెలలో ఇప్పటి వరకు రేషన్ షాపులకు బియ్యం రవాణా ప్రారంభం కాలేదు. వాస్తవానికి ప్రతినెలా 20 నుంచి 28 తేదీ వరకు ఎస్‌డబ్ల్యూసీ స్టేజ్-1 గోదాంల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లు స్టేజ్-2కు చేరుకుని అక్కడి నుంచి రేషన్ షాపులకు బియ్యం రవాణా అవుతాయి. కానీ ఈ నెల 29 వచ్చినప్పటికీ ఇప్పటికి వరకు అసలు స్టేజ్-2 వద్దకే బియ్యం చేరుకోకపోవడం గమనార్హం. మరో రెండు రోజుల్లో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా షాపుల వద్దకు ఎప్పుడు వస్తాయో తెలియక డీలర్లు అయోమయంగా ఉన్నారు.*

### హమాలీల సమ్మె..

జిల్లాలోని రేషన్ షాపులకు సకాలంలో బియ్యం సరఫరా కాకపోవడానికి సరిపడా సన్నబియ్యం లేకపోవడం ఒక కారణమైతే, మరో పక్క ఎస్‌డబ్ల్యూసీ హమాలీలు తమ కూలీచార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తుండడం మరో కారణం. గత కొద్ది రోజులుగా హమాలీలు తమ కూలీచార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తుండటంతో అధికారులతో పలు దఫాలుగా జరిగిన చర్చలు కొలిక్కి రాకపోవడంతో వారు సమ్మె చేస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు ఈ సారి మూడు నెలలకు సరిపడా ఒకే సారి బియ్యం ఇస్తామని కేంద్రం చెప్పడంతో జిల్లాలోని 3,26,057 రేషన్‌కార్డు లబ్ధిదారులకు 17,800 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం కావాల్సి ఉన్నది. అయితే జిల్లాలోని గోదాంలల్లో ప్రస్తుతం 10వేల మెట్రిక్ టన్నులకు మించి సన్నబియ్యం లేవని మిగిలిన వాటి కోసం ఇతర జిల్లాల వైపు చూస్తుండడం కూడా ఆలస్యానికి కారణమని అధికారుల ద్వారా తెలిసింది. ఇప్పుడే ఇలా ఉంటే మూడు నెలల తరువాత సన్నబియ్యం స్కీం ఎలా కొనసాగిస్తారో అర్థం కాని విషయం. గత వానకాలంలో కొనుగోలు చేసిన సన్నవడ్లను సీఎంఆర్ ద్వారా బియ్యం తీసుకుని రేషన్ పంపిణీ చేస్తుండగా ఈ యాసంగిలో పండిన సన్నాలలో 20శాతం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం పట్ల సన్నబియ్యం స్కీం అమలుపై అనుమానాలు బలపడుతున్నాయి.

### దోపిడీకి చెక్ పెట్టాలి : డీలర్లు

ప్రతి నెలా డీలర్లకు సరఫరా చేసే బియ్యం బస్తాల్లో తూకం తరుగు ఉంటుందని, సన్నబియ్యం పంపిణీతో లబ్ధిదారులు తీసుకుంటుండగా తాము తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు డీలర్లు వాపోతున్నారు. బియ్యం సరఫరాలో ఎవరికీ కనిపించని దోపిడీ కాగా.. ఈ అక్రమాలకు డీలర్లే బాధ్యులనుకుంటే పొరపాటే ఎందుకంటే ఇక్కడ మోసపోయేదే డీలర్లు కావడం విశేషం. డీలర్లకు వచ్చే బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దనే చోరీ చేస్తున్నారు. డీలర్లకు వచ్చే 50కిలోల బస్తాలో ప్రతి బస్తాకూ 2 నుంచి రెండున్నర కిలోల వరకు తరుగు వస్తున్నట్లు డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీలర్లకు బస్తాతో కలిపి 50.500 కిలోలు ఉండాల్సి ఉండగా 48 కిలోలు మాత్రమే ఉంటుండగా కొన్ని బస్తాల్లో అయితే 45 నుంచి 47 కూడా ఉంటున్నాయంటున్నారు. విచిత్రమేంటంటే స్టేజ్-1 నుంచి స్టేజ్-2కు లారీల్లో వేబ్రిడ్జిపై కాంటా వేసి 100క్వింటాళ్ల బియ్యం 50కిలోల బస్తాలు వస్తే వాస్తవానికి 200ల బస్తాలు రావాల్సి ఉండగా తరుగు కారణంగా అదనంగా మరో 20 బస్తాలు కలిపి 220 వరకు స్టేజ్-2కు చేరుకుంటాయి. కానీ స్టేజ్-2 నుంచి డీలర్లకు మాత్రం శాల్తీల లెక్కన వేస్తుండడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని డీలర్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే తమ వద్ద ఉన్న పాత దొడ్డు బియ్యం తీసుకోకపోవడంతో ముక్కిపోయి పురుగు పట్టిన కారణంగా సన్నబియ్యంలోకి పురుగులు చేరి వినియోగదారులు ఆందోళనలు చేసే అవకాశం ఉందంటున్నారు. వెంటనే వాటిని తరలించాలని కోరుతున్నారు. ఈ విషయాలపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రసాద్‌ను వివరణ కోరగా హమాలీల పంచాయితీ త్వరలోనే ముగిసిపోతుందని, బియ్యం రవాణా ప్రారంభిస్తామన్నారు. సన్నబియ్యం తక్కువ పడే అవకాశం లేదని, ఒకవేళ తక్కువ అయినా ఇతర జిల్లాల నుంచి తెప్పిస్తామని డీలర్లకు తక్కువ తూకం వస్తే ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఉండే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

'పచ్చిరొట్ట'లో

# మట్టిపెళ్లలు, రాళ్లు!



మట్టిపెళ్లలు, రాళ్లతో కూడిన జీలుగలు

- నాణ్యతలేమి విత్తనాలు సరఫరా చేస్తున్న వ్యవసాయశాఖ
- సబ్సిడీ పేరుతో అన్నదాతలను నిండా ముంచుతున్న సర్కార్

నల్లగొండ, మే 30: 50 శాతం సబ్సిడీ పేరుతో సర్కారు అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు నాణ్యతలేమితో వస్తున్నాయి. దీంతో రైతులు నిండా మునుగుతున్నారు. తెలంగాణ సీడ్ కార్పొరేషన్, నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా జిల్లావ్యాప్తంగా 3,500 క్వింటాళ్ల జనుము, 620 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను ఈ సీజన్‌లో అందజేయాల్సి ఉండగా..ఇప్పటివరకు 2,326 క్వింటాళ్ల విత్తనాలను రైతులు కొనుగోలు చేశారు. ఈ విత్తనాలను ఈ నెల మొదటి వారంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్‌లో ప్రారంభించారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో రైతులు వాటిని ఓపెన్ చేయగా.. ఇసుక, రాళ్లు, మట్టి పెళ్లలే దర్శనమిస్తున్నాయి. ఈ విషయాన్ని వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కొన్ని ప్రాంతాల్లో పట్టించుకోకపోగా, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం వాపస్ ఇవ్వమని, వాటికి బదులుగా మినుములు తీసుకెళ్లాలనే సమాధానాలు ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ విషయమై డీఏవో శ్రవణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఇప్పటికే 57 శాంపిళ్లను పరిశీలించి సరఫరా చేశామని, క్వాలిటీ లేకపోతే వాపస్ ఇచ్చి వేరేవి తీసుకెళ్లవచ్చని తెలిపారు.

# డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల అరెస్టు



సూర్యాపేటలో అరెస్టయిన లబ్ధిదారులు

సూర్యాపేటటౌన్, మే 30: సూర్యాపేటలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దగ్గర పనులు కొనసాగడం లేదని, ఇదే విషయాన్ని శుక్ర వారం కలెక్టరేట్‌కు వచ్చిన మంత్రులకు చెప్పేందుకు వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేసినట్లు లబ్ధిదారులను వాపోయారు. పట్టణంలో తమకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించారని, అందులో మిగిలిన పనులు నేటి వరకూ పూర్తి చేయడం లేదని వారు ఆవేదన చెందారు. అన్యాయంగా తమను అరెస్టు చేసి సూర్యాపేట రూరల్, సూర్యాపేట పట్టణ, చివ్వెంల పోలీస్‌స్టేషన్‌కు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది 804 మంది లబ్ధిదారుల సమస్య అని వారు చెప్పారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో ఎస్.కె.ఆశ, కాటూరి భిక్షమమ్మ, పావని, శారద, రేణుక, ఉపేంద్ర, ఎం.డి.రఫీ, రాచకొండ ఉపేందర్, నల్లగందుల వెంకటేశ్వర్లు, సందీప్, అనిల్ తదితరులు ఉన్నారు.



నిండుకుండలా మారిన మూసీ రిజర్వాయర్

# నీటితో మూసీ కళకళ

కేతేపల్లి, మే 30: ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండవ అతిపెద్ద సాగునీటి వనరైన మూసీ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. అకాల వర్షాలతో ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 988.30 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. గత పది రోజులుగా ఇన్‌ఫ్లో ఇదే స్థాయిలో వస్తున్నది. ప్రాజెక్టు నుండి 95.17 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో వెళుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 645(4.46 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 639.20(3.03 టీఎంసీలు) అడుగులు ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ మధు తెలిపారు.

# ఎమ్మెల్యేలు చెప్పిందే ఫైనల్

## ఇందిరమ్మ ఇండ్లపై లొల్లిలొల్లి

## అర్హులకే ఇవ్వాలని డిమాండ్

సూర్యాపేట, మే 30 : జిల్లాలో అర్హులైన పేదలకు ఇండ్లు అందేలా చూడాలని రాష్ట్ర మంత్రులకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి చట్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్లపై ప్రశ్నలు సంధించారు. సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల ఎంపికలో స్థానిక ఎమ్మెల్యే చెప్పిందే ఫైనల్ అనేది అధికారులు గుర్తుంచు కోవాలన్నారు.

### అవినీతికి ఆస్కారం లేదు: ఉత్తమ్‌కుమార్ రెడ్డి

కలెక్టర్‌నుంచి అటెండర్ వరకూ జిల్లాలో ఎక్కడా అవినీతి లేకుండా పాలన పారదర్శకంగా జరగాలి. ఏమాత్రం అలసత్వం, అవినీతి జరిగినా ఉపేక్షించేది లేదు. నిరుపేదలకు నిజాయితీగా పథకాలు అందించాలి. త్వరలోనే ఎస్ఎల్‌బీసీ పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. జిల్లాలో ఉన్న నాలుగు వేల ఎకరాల అటవీ భూమి అన్యాక్రాంతమవుతున్నది. వెంటనే సూర్యాపేట జిల్లా అధికారులు ఆ అటవీ భూములు కాపాడాలన్నారు.

### నల్లగొండనూ అభివృద్ధి చేయాలి: మంత్రి కోమటిరెడ్డి

ఒక్క ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసమే ఆలోచించకండి.. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి సహకరించాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. జిల్లాలో పంట భారీగా పెరిగింది వాటిని నిల్వ చేయడానికి సరిపడా గోదాంలు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టకుండా పేదలకు సన్నబియ్యం ఇస్తున్నదని వారు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. అర్హులకే ఇండ్లు ఇవ్వాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరారు. ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి అంశాలపై సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, యాదాద్రి కలెక్టర్ హనుమంతరావులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బీర్ల అయిలయ్య, శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సూర్యాపేట ఎస్పీ నరసింహ, కార్పొరేషన్ చైర్మన్లు రాయల్ నాగేశ్వరావు, పటేల్ రమేశ్‌రెడ్డి, చెవిటి వెంకన్నయాదవ్, వేణురెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

గంధమల్ల చెరువు



మెరుగైన పరిహారం కోసం

# అన్నదాతల పట్టు

## గంధమల్ల భూసేకరణకు తకరారు

- 994 ఎకరాలు కోల్పోతున్న 547 మంది కర్షకులు
- ఎకరాకు రూ.11 లక్షలే పరిహారమంటున్న సర్కారు
- రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- లేదంటే.. భూమికి భూమి ఇవ్వాలని ప్రతిపాదన
- అధికారులతో చర్చల్లో కుదరని ఏకాభిప్రాయం
- జూన్ 6న 'గంధమల్ల'కు సీఎం రేవంత్ శంకుస్థాపన

*లక్షల విలువ చేసే భూములు.. పచ్చని సాగు పొలాలు.. రైతులకు వంశపారంపర్యంగా వస్తున్న ఆస్తులు.. కానీ, సర్కారు మాత్రం అడ్డికి పావుశేరు లెక్క తీసుకునేందుకు సన్నద్ధమవుతున్నది. గంధమల్ల రిజర్వాయర్ పేరుతో అరకొర పరిహారం అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. అయితే తమకు సరైన న్యాయం చేసే దాకా విలువైన భూములు ఇచ్చేది లేదంటూ రైతులు తేల్చి చెబుతుండటంతో కొత్త చిక్కు ఎదురైంది. ఇటీవల రైతులతో జరిగిన చర్చల్లోనూ సయోధ్య కుదరకపోవడంతో మరోసారి భేటీ కానున్నారు.*

యాదాద్రి భువనగిరి, మే 30 (నమస్తే తెలంగాణ)/ తుర్కపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ-15లో తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని గత ప్రభుత్వం 2017లో ప్రతిపాదించింది. కానీ, వివిధ కారణాలతో ముందుకు సాగలేదు. 9.36 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించాలని మొదట నిర్ణయించారు. అయితే, రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో 4.28 టీఎంసీలకు కుదించారు. అయినా ముంపు గ్రామాల ప్రజలు ప్రతిఘటించడంతో 1.41 టీఎంసీలకు తగ్గించారు. రిజర్వాయర్ ప్రారంభంలో రూ.860 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించగా.. నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతో రూ.575 కోట్లకు పరిమితమైంది. రిజర్వాయర్ పూర్తయితే 58,687 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నది.

### 547 మంది రైతులు.. 994 ఎకరాలు..

గంధమల్ల రిజర్వాయర్‌లో భాగంగా గంధమల్ల, వీరారెడ్డిపల్లి గ్రామాలు ముంపునకు గురికానున్నాయి. గంధమల్లలో 612 ఎకరాలు, వీరారెడ్డిపల్లిలో 252 ఎకరాల చొప్పున 547 మంది రైతులు 994 ఎకరాలు కోల్పోనున్నారు. 2 కి.మీ. పొడవునా కట్ట నిర్మాణానికి 112 ఎకరాలను గంధమల్లలో సేకరించనున్నారు. అయితే, ఇటీవల భూసేకరణ ప్రక్రియ ప్రారంభించారు. మార్కెట్ ధర, గత మూడేండ్ల రిజిస్ట్రేషన్ ధరలు బేరీజు వేసి పరిహారం అంచనా వేసేందుకు సిద్ధమయ్యారు.

### ఎకరాకు రూ.11లక్షలే ఇస్తారట..

తెలంగాణ ఏర్పాటు తర్వాత జిల్లాలో భూముల రేట్లు అమాంతం పెరిగాయి. తుర్కపల్లి.. అటు హైదరాబాద్, ఇటు యాదగిరిగుట్టకు దగ్గరగా ఉండటంతో భూములకు మంచి డిమాండ్ వచ్చింది. ప్రస్తుతం ఎకరాకు రూ.70 లక్షల నుంచి రూ. 80 లక్షల వరకు పలుకుతున్నది. అయితే, భూసేకరణకు సంబంధించి ఇటీవల అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి రైతులతో ఓ దఫా సమావేశమై పరిహారంపై చర్చలు జరిపారు. అధికారులు మాత్రం నిబంధనల ప్రకారం 2023 భూసేకరణ ఆర్ఎఫ్‌సీటీ కింద ఎకరాకు రూ.11 లక్షల పరిహారం చెల్లిస్తామని స్పష్టంచేశారు. దీనికి రైతులు ససేమిరా అంటూ.. విలువైన భూములు అంత తక్కువ ధరకు ఎలా ఇస్తామని వ్యతిరేకించారు. మరోసారి రైతులతో చర్చించనున్నారు.

### ఇవీ రైతుల డిమాండ్లు..

తమ విలువైన భూములు పోతుండటంతో రైతులు కొత్త డిమాండ్లు తెరపైకి తెచ్చారు. ఎకరాకు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. అంతేకాకుండా భూములు కోల్పోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో భూమికి భూమి ఇవ్వాలని తేల్చిచెబుతున్నారు. అధికారులు మాత్రం పరిహారాన్ని కొద్దిమేర పెంచి ఒప్పించాలనే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. కాగా, జూన్ 6న సీఎం రేవంత్‌రెడ్డి గంధమల్ల రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేయనున్న విషయం తెలిసిందే.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణారెడ్డి(ఫైల్)

### ఎకరాకు రూ.40 లక్షల పరిహారం ఇవ్వాలి



రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న కొందరు రైతులకు ఇస్తున్నట్లు గంధమల్ల రిజర్వాయర్ భూనిర్వాసితులకు సైతం ప్రభుత్వం ఎకరాకు రూ.40 లక్షలు చెల్లించాలి. అధికారులు ఎకరానికి రూ.11 లక్షలు చెల్లిస్తామనడం సరికాదు. ప్రస్తుతం మార్కెట్‌లో భూమి విలువ రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలు పలుకుతున్నది. దానికి అనుగుణంగా న్యాయమైన పరిహారం చెల్లించాలి. లేకుంటే భూములు ఇచ్చేది లేదు.

**- అనుముల వెంకట్‌రెడ్డి, గంధమల్ల**

### భూమికి భూమి ఇవ్వాల్సిందే..



గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతే తామంతా రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. మా భూములు తీసుకుంటే పరిహారం చెల్లించడంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి. లేదంటే భూమికి సమానంగా భూమి ఇవ్వాల్సిందే. ప్రభుత్వం పునరాలోచించి తమకు సరైన న్యాయంచేయాలి. పరిహారంలో తేడా వస్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నాం.

**- గడిపే ఇస్తారి, భూ నిర్వాసిత రైతు, గంధమల్ల**